ప్రజాశక్తి
గురువారం 20 ఏప్రిల్ 2023
I
అల్లూరి సీతారామరాజు

21న పెన్షన్, జిపిఎఫ్ అదాలత్

జిల్లా ఖజానాధికారి ప్రసాద్ బాబు

ప్రజాశక్తి- పాడేరు: ఈ నెల 21న పాడేరు కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించనున్న పెన్షన్, జిపిఎఫ్ అదాలత్‌ను లబ్ధిదారులందరూ సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఖజానాధికారి ఆర్.ప్రసాద్ బాబు బుధవారం ఒక ప్రకటనలో సూచించారు. జిల్లాలో పెండింగ్‌లో ఉన్న పెన్షన్, కుటుంబ పెన్షన్, జిపిఎఫ్ చందాలు, క్లెయిములకు సంబంధించిన సమీక్షించి, పరిష్కరించేందుకు వీలుగా ఈ పెన్షన్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు ఆయన వివరించారు. సమస్యలను వీలైనంత వరకు అక్కడికక్కడే పరిష్కరించే అవకాశం ఉన్నందున ఈ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఖజానాధికారి కోరారు. పింఛనుదారులు ఫిర్యాదు సమర్పించేటప్పుడు వారి పేరు, పదవీ విరమణ హోదా, పెన్షన్ పేమెంట్ ఆర్డర్ నంబర్, బ్యాంక్ వివరాలు, పదవీ విరమణ తేదీ; చిరునామాతో సమర్పించాలని సూచించారు. పెన్షన్ పేమెంట్ ఆర్డర్ కాపీలు, బ్యాంకుపాస్ బుక్ జత చేయాలని ఆయన కోరారు.

మైనింగ్ తవ్వకాలు చేపడితే సహించం

-జెడ్‌పిటిసి దీసరి గంగరాజు
- మైనింగ్ ప్రజాభిప్రాయ సేకరణపై గిరిజనుల ఆందోళన
-జెసి , ఏపీఎండీసీ అధికారుల అడ్డగింత

అధికారులను అడ్డగిస్తున్న జెడ్‌పిటిసి గంగరాజు, నాయకులు గిరిజనులు

ప్రజాశక్తి-అనంతగిరి: గిరిజన చట్టాలు, హక్కులను తుంగలో తొక్కి మైనింగ్ తవ్వకాల ప్రజాభిప్రా సేకరణకు వచ్చిన అధికార బృందాన్ని స్థానిక సిపిఎం జెడ్‌పిటిసి దీసరి. గంగరాజు, సమత ఆర్గనైజర్ డైరెక్టర్ రెబ్బ ప్రగఢ రవి, గిరిజనులు బుధవారం అడ్డుకున్నారు. జాయింట్ కలెక్టర్ శివ శ్రీనివాస్, ఖనిజ సంపద కాలుష్య నియంత్రణ అధ్యక్షతన ఏపీఎండిసి అధికారుల బృందంతో మండలంలోని వాలసి పంచాయతీ పరిధి నిమ్మలపాడు, రాళ్లగరువు గ్రామం వద్ద జరిగిన మైనింగ్ ప్రజాభిప్రా సేకరణ అధికార బృందాన్ని నిలదీశారు. స్థానిక సర్పంచ్ గిరిజనులు మైనింగ్ తవ్వకాలకు వ్యతిరేకంగా ఆందోళన చేపట్టారు. నిమ్మలపాడు గ్రామం లో ప్రారంభమైన ర్యాలీ కరకవలస, రాళ్లగెడ్డలో ఏర్పాటు చేసిన సభా వేదిక వరకు భారీ ర్యాలీ చేపట్టారు. సభా వేదికలో హాజరైన జాయింట్ కలెక్టర్, ఖనిజ సంపద కాలుష్య నియంత్రణ, స్థానిక తహసీల్దార్, ఏపీఎండీసీ అధికారులను ప్రజాప్రతినిధులు, గిరిజనులు ప్రశ్నించారు. ప్రజా అభిప్రాయ సేకరణ నిర్వహిస్తున్నట్లు ప్రజా ప్రతినిధులు, గిరిజనులకు ఎటువంటి సమాచారం ఎందుకు ఇవ్వలేదని నిలదీశారు. ఎటువంటి ప్రజాభిప్రాయ సేకరణ లేకుండా గత 18 సంవత్సరాలుగా మైనింగ్ జరపడం సరికాదని, దీంతో తమ పంట పొలాలు కాలుష్యంతో దెబ్బతింటున్నాయని, పలు రోగాలతో తాము ఇబ్బందులకు గురవుతున్నామని తెలిపారు. ఇప్పటివరకు అక్రమంగా తవ్వకాలు జరిపిన మైనింగ్ ప్రాంతాన్ని పరిశీలించాలని అధికారులను చుట్టుముట్టి నిలదీశారు. దీంతో ఆ ప్రాంతంలో సందర్శించారు. అనంతరం సభా వేదికకు వచ్చిన అధికారులు గిరిజన ప్రజలు, స్థానిక ప్రజా ప్రతినిధుల నుంచి వేరువేరుగా అభిప్రాయాలను నమోదు చేసుకున్నారు.

ఈ సభ వేదికను ఉద్దేశించి జెడ్‌పిటిసి గంగరాజు మాట్లాడుతూ, వాలసి పంచాయతీ తూఖర్తి, కరకవలస, రాళ్లగెడ్డ గ్రామాలకు అనుకొనున్న కాల్ సైట్ మైనింగ్ 2006 సంవత్సరం నుంచి బినామీ దారులతో తవ్వకాలు జరుపుతున్నారన్నారు. బినామీ దారులైన దురియా రుక్మిణి, రొబ్బ శంకరరావులు మైనింగ్ కొల్లగొట్టి దోచుకున్నారని విమర్శించారు. గ్రామ అభివృద్ధి, పనిచేసిన రైతులకు కనీస కూలి చెల్లించకుండా కోట్ల రూపాయలు మైనింగ్ మాఫియా దోచుకుందన్నారు. మైనింగ్ యాక్ట్ ప్రకారం గ్రామ పంచాయతీకి రాయల్టీ చెల్లించాల్సి ఉన్నప్పటికీ ఏపీఎండిసి పేరుతో బినామీ వ్యవస్థను పెట్టి మైనింగ్ తవ్వకాలు జరిపే చూస్తూ ఊరుకునేది లేదని, గిరిజనుల పక్షాన ఉంటూ న్యాయం జరిగే వరకూ తమ పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. పూర్తిగా మైనింగ్ లీజులను రద్దు చేసి గిరిజన భూములు గిరిజనులకు అప్పగించాలని ఆయన డిమాండ్ చేశారు.

సభలో మాట్లాడుతున్న గంగరాజు

సమత డైరెక్టర్ రవి మాట్లాడుతూ, నిమ్మలపాడు కాల్ సైట్ మైనింగ్ తవ్వకాలు నిర్వహించేందుకు టాటా, బిర్లా అప్పట్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో ఒప్పందం కుదిరించుకుందని తెలిపారు. దీనికి వ్యతిరేకంగా గిరిజనుల పక్షాన సుప్రీంకోర్టులో కేసు వేయడం జరిగిందన్నారు. తమకు అనుకూలంగా సుప్రీంకోర్టు తీర్పు ఇవ్వడంతో టాటా, బిర్లా సంస్థలు వెనుక్కు వెళ్లి పోయారని, ఇదే గతి ఏపీఎండిసికు పడుతుందని తెలిపారు. పంచాయతీ, పీసా అనుమతులు లేకుండా ఇష్టం రాజ్యంగా మైనింగ్ తవ్వకాలు నిర్వహిస్తే చూస్తూ ఊరుకునేది లేదన్నారు.

సర్పంచ్ సెంబి. సన్యాసిరావు మాట్లాడుతూ గ్రామ పంచాయతీ, ప్రజలకు నష్టానికి గురి చేసే మైనింగ్ తవ్వకాలకు వ్యతిరేకిస్తూ ప్రజల పక్షాన ఉంటానన్నారు. జాయింట్ కలెక్టర్ శివ శ్రీనివాస్ మాట్లాడుతూ, మైనింగ్ తవ్వకాలను పూర్తిగా పరిశీలించి ప్రభుత్వానికి, అధికారులకు తెలియపరచాలని ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఖనిజ సంపద కాలుష్య నియంత్రణ ఇంజనీరింగ్ అధికారి. సుదర్శన్, తహసీల్దార్ రామ భాయి, సిపిఎం టోకూరు సర్పంచ్ కె.మొసియా, మండల కార్యదర్శి ఎస్.నాగులు, వాలసి మాజీ సర్పంచ్ ధర్మన్న, గురుమూర్తి, గ్రామస్తులు పాల్గొన్నారు.

మండలంలో కోవిడ్ విజృంభణ

19కి చేరిన పాజిటివ్ కేసులు



ప్రజాశక్తి-రాజవొమ్మంగి

మండలంలోని కోవిడ్ మహమ్మారి మరో సారి విజృంభిస్తుంది. గత మూడు రోజుల్లో మండలంలో 19 పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. బుధవారం రాజవొమ్మంగి పిహెచ్‌సి పరిధిలో 11 మందికి కోవిడ్ పరీక్షలు నిర్వహించగా ముగ్గురికి పాజిటివ్ ఉన్నట్లు నిర్ధారణ కాగా, జడ్డంగి పీహెచ్సీ పరిధిలో నలుగురికి కోవిడ్ పరీక్షలు నిర్వహించగా ఇద్దరికి, లాగరాయి పిహెచ్‌సి పరిధిలో 8 మందికి పరీక్షలు నిర్వహించగా ఆరుగురికి పాజిటివ్ ఉన్నట్లు తేలిందని ఆయా పీహెచ్‌సీల వైద్యాధికారులు లిఖిత, సేవాసుజి, రవీంద్ర తెలిపారు. రోజురోజుకీ కోవిడ్ పాజిటివ్ కేసులు పెరుగుతున్న నేపథ్యంలో మండలవాసులు భయాందోళన చెందుతున్నారు. వాతావరణంలో మార్పుల నేపథ్యంలో ఇప్పటికే ఆయా పీహెచ్‌సిల పరిధిలో జ్వరం, దగ్గు, రొంప, ఒళ్ళు నొప్పులు వంటి రుగ్మతలతో బాధపడుతూ పీహెచ్సీలకు వచ్చే రోగుల సంఖ్య పెరుగుతుంది. ఈ నేపథ్యంలో ప్రజలు తప్పనిసరిగా మాస్కులు వినియోగించాలని, వ్యక్తిగత పరిశుభ్రత పాటించడంతోపాటు, కోవిడ్ వ్యాప్తి చెందకుండా జాగ్రత్తలు పాటించాలని ఆయా పీహెచ్‌సీల వైద్యాధికారులు సూచించారు.

పంట కాలువల పూడికతీత పనులు చేపట్టాలి

జిల్లా పరిషత్తు సమావేశంలో జెడ్‌పిటిసి జ్యోతి

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

మండలంలోని అప్పలరాజుపేటలోని అమ్మాయి గొప్ప, జడ్డంగి మడేరు కాలువల్లో పూడికతీత పనులు చేపట్టాలని బుధవారం జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో రాజవొమ్మంగి జెడ్పిటిసి ఒడుగుల జ్యోతి అధికారులకు విన్నవించారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిషత్ సమావేశం కాకినాడలోని జెడ్పి మందిరంలో బుధవారం జరిగింది. ఇందులో పాల్గొన్న జెడ్పిటిసి వడుగుల జ్యోతి మాట్లాడుతూ, రాజవొమ్మంగి మండలం అప్పలరాజుపేటలో అమ్మెగొప్పు చెరువు నుండి పొలాలకు సాగునీరు అందే కాల్వలో చెత్త, చెదారం పేరుకుపోవడంతో గతంలో రైతులందరూ కలిసి సొంతంగా పూడిక తీత పనులు చేపట్టుకున్నారని తెలిపారు. ఇప్పుడు మళ్లీ యథా స్థితిలో ఉందని, రైతులకు సాగునీరు పూర్తిస్థాయిలో అందే పరిస్థితి లేదని తెలిపారు. జడ్డంగిలో మడేరు వాగుకి ఆనుకొని ఉన్న ఎడమ, కుడి కాల్వలు జంగిల్, పూడిక తీయకపోవడం వలన రైతులకు ఒక పంటకే పూర్తిగా నీరు ఇవ్వలేని పరిస్థితి నెలకొందని చెప్పారు. ఇరిగేషన్ అధికారులకు ఎన్ని మార్లు తెలిపిన ఎవరూ పట్టించుకోవడం లేదని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ సంవత్సరం అయిన పంట కాలువలో జంగిల్ కటింగ్, పూడిక తీత పనులు చేపట్టి రైతులకు సాగు నీరు అందేలా చర్యలు చేపట్టాలని కోరారు.

జిల్లా పరిషత్తు సమావేశంలో మాట్లాడుతున్న జెడ్‌పిటిసి జ్యోతి

సిపిఎం నేతలకు ఘన నివాళి

పాడేరులో నినాళులర్పిస్తున్న అప్పలనర్స, నాయకులు

ప్రజాశక్తి -పాడేరు: సిపిఎం నేతలకు పాడేరు లో బుధవారం అల్లూరి జిల్లా సిపిఎం జిల్లా ప్రధాన కార్యదర్శి పి అప్పల నరస, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బోనంగి చిన్నయ్య పడాల్, తదితరులు ఘనంగా నివాళులర్పించారు. ఈ నెల 17న మృతి చెందిన అనకాపల్లి మాజీ కౌన్సిలర్ సీనియర్ నేత మళ్ళ సత్యనారాయణతో పాటు బుధవారం తెల్లవారుజామున గుండెపోటుతో మరణించిన సిపిఎం సీనియర్ నాయకులు వి,కృష్ణమూర్తి చిత్ర పటాలకు పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా అప్పలనర్స మాట్లాడుతూ, నేతలిద్దరూ ప్రజా ఉద్యమాల్లో భాగస్వాములై విశిష్ట సేవలందించారని కొనియాడారు. ప్రజా సమస్యలకు పరిష్కారం కోసం నిరంతరం పాటుపడిన వారి జ్ఞాపకాలు ఎప్పుడూ నిలిచి ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు సుందర్రావు, మంగమ్మ పాల్గొన్నారు.

అరకులోయ రూరల్: సిపిఎం సీనియర్ నాయకులు కృష్ణమూర్తి, మల్ల సత్యనారాయణమూర్తిల మృతి పార్టీకి తీరని లోటని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కిల్లో సురేంద్ర, జిల్లా కార్యదర్శి సభ్యులు వి.ఉమామహేశ్వరరావు తెలిపారు. బుధవారం అరకువ్యాలీలోని గిరిజన సంఘం కార్యాలయంలో నేతల చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, వీరి ఆశయ సాధనకు మనందరం కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి కె.రామారావు, మండల కమిటీ సభ్యులు పి.బాలదేవ్, కే.మగ్గన్న, ప్రసాద్, గాసి బాలకృష్ణ.తదితరులు పాల్గొన్నారు.

అరకులో నివాళులర్పిస్తున్న సురేంద్ర, ఉమా మహేశ్వరరావు

ఎండలో పని చేస్తున్న కూలీలు

మండుటెండలో ఉపాధి హామీ పనులు

పని ప్రదేశంలో సౌకర్యాలు కరువు

ప్రజాశక్తి -పెదబయలు రూరల్ : మండలంలోని రూడకోట పంచాయతీ కొత్త రూడకోట గ్రామంలో బుధవారం మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం పనులు ప్రారంభం అయ్యాయి. అయితే ఉపాధి హామీ పనుల పని ప్రదేశంలో టెంటు సౌకర్యం, చంటి పిల్లల ను ఆలనా పాలన చూసుకునేందుకు ఆయా, కూలీలకు చలివేంద్రం శిబిరాలు, ప్రథమ చికిత్స కిట్లు ఏర్పాటు చేయాల్సి ఉంది. కనీసం మంచినీరు లేక మజ్జిగ ఏర్పాటు చేయాల్సి ఉంది. ఎండ తీవ్రంగా ఉన్నా అధికారులు పట్టించుకోలేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పని ప్రదేశాలలో పూర్తిస్థాయిగా సౌకర్యాలు కల్పించాలని స్థానికులు తమ గోడును వినిపించారు.

పిఒతో మాట్లాడుతున్న సిఐటియు నేత బాలదేవ్

హెచ్ఎన్‌టీసీ కార్మికుల సమస్యల పై

పిఒకు సిఐటియు నాయకుల వినతి

ప్రజాశక్తి-అరకులోయ రూరల్: హెచ్ఎన్‌టీసీ కార్మికుల సమస్యలపై అరకులోయ పర్యటనకు వచ్చిన పాడేరు ఐటీడీఏ పీఓ అభిషేక్ కు పద్మపురం గార్డెన్లో సిఐటియు ఆధ్వర్యంలో వినతి పత్రాన్ని అందజేశారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు పి.బాలదేవ్ ఐటీడీఏ పీవోకు సమస్యలను వివరించారు. అల్లూరి జిల్లాలో అరకువేలి మండలం పద్మావతి గార్డెన్, కొత్తవలస, చింతపల్లి నర్సరీలో పని చేస్తున్న హెచ్ఎన్‌టిసి కార్మికులకు 2022-23 కలెక్టర్ గెజిట్ జీవో ప్రకారం జీతాలు చెల్లించాలని కోరారు. 56 మంది కార్మికులకు మూడు నెలల బకాయి జీతాలు చెల్లించాలని చెప్పారు. కొత్తగా నియమించబడిన కార్మికులకు కలెక్టర్ గెజిట్ జీవో ప్రకారుం జీతాలు వర్తింప జేసి పీఎఫ్ సౌకర్యం కల్పించాలని కోరారు.కార్మికులకు వారాంతపు సెలవు అమలు చేయాలన్నారు.2010-2012 సంవత్సరాల ఈపీఎఫ్ డబ్బులు కార్మికుల నుండి వసూలు చేసి ఈపీఎఫ్ ఖాతాలో జమ చేయకుండా అవినీతి చేసిన వారిపై తక్షణమే చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు. నెల రోజుల్లో సమస్యలు పరిష్కారం చేస్తామని కార్మికులకు పిఒ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి జే.భగత్ రామ్, హెచ్.ఎన్.టి.సి వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు జగ్గారావు, పండు, సీతారాం, జోగి బాబు, శోభన్, కిరణ్ కుమార్, లక్ష్మి, మాలతి, అప్పలమ్మ, విమల పాల్గొన్నారు.

బిజెపి ప్రభుత్వాన్ని గద్దె దించేవరకు పోరాటం

ప్రచార భేరిలో సిపిఎం రంపచోడవరం జిల్లా కార్యదర్శి కిరణ్

పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సిపిఎం రంపచోడవరం జిల్లా కార్యదర్శి కిరణ్ తదితరులు

ప్రజాశక్తి- కూనవరం

కేంద్రంలో బిజెపి ప్రభుత్వాన్ని గద్దె దించే వరకు పోరాటం చేయాలని సిపిఎం ఎఎస్ఆర్ రంపచోడవరం జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్ పిలుపునిచ్చారు. బిజెపి ప్రభుత్వ కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సిపిఎం, సిపిఐ కేంద్ర కమిటీల పిలుపు మేరకు జరుగుతున్న ప్రచార భేరి వాల్ పోస్టర్లను మండలంలోని ముల్లూరు గ్రామంలో స్థానికులతో కలిసి బుధవారం కిరణ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని మోడీ ప్రభుత్వం జాతీయ ప్రాజెక్టు అయిన పోలవరంకు నిధులు, నిర్వాసితులకు పరిహారం ఇవ్వకుండా మోసం చేస్తుందని విమర్శించారు. దీనిపై రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వం నోరు మెదపకపోవడం దుర్మార్గమన్నారు. కార్యక్రమంలో బాబు బొర్రయ్య, సర్పంచ్ నాగమణి, తమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో ప్రచార భేరి

ప్రచార భేరి కార్యక్రమం కూనవరం మండలంలోని కూటూరు, లింగాపురం, అభిచర్ల గ్రామాల్లో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి పాయం సీతారామయ్య, వైస్ ఎంపీపీ కొమరం పెంటయ్య మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం ఉపాధి హామీ చట్టాన్ని అమలు చేయకుండా నిర్వీర్యం చేయడానికి కుట్ర చస్తుందని విమర్శించారు. వైసీపీ ప్రభుత్వాన్ని సాగనంపే రోజులు దగ్గర్లోనే ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు మేకల నాగేశ్వరరావు, నాయకులు పాయం జ్యోతి, సోడే శంకర్, సర్పంచ్ వెంకమ్మ, మాజీ సర్పంచ్ రవ్వ ప్రసాద్, రాజు, సోడే రత్తయ్య పాల్గొన్నారు.

గోదావరి వరద ముంపు గ్రామాలను పోలవరం జాబితాలో చేర్చాలి

ఎటపాక : ప్రచార బేరి కార్యక్రమం బుధవారం మండలంలోని మురుమూరు జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు మాట్లాడుతూ పోలవరం నిర్వాసితులకు న్యాయం చేయడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని విమర్శించారు. ప్రాజెక్టు పునరావాసానికి కావాల్సిన నిధులను కేంద్రం నుండి రాబట్టడంలో రాష్ట్ర ప్రభుత్వం చొరవ చేయడం లేదన్నారు. 41.15 మీటర్ల వరకే ప్రస్తుత నిర్మాణమని కేంద్రం చెబుతున్న నేపథ్యంలో 45.72 కాంటూరు లెవెల్ ముంపునకు గురయ్యే గ్రామాలకు పునరావాసం కల్పించదని తేటతెల్లమైందని చెప్పారు. ప్రతి ఏటా గోదావరి వరదలకు మురుమూరుతో పాటు మండలంలోని పలు గ్రామాలు ముంపునకు గురవుతున్నాయని, ఈ గ్రామాలను 41.15 కాంటూరులో చేర్చి నిర్వాసితులకు పునరావాస ప్యాకేజీ ఇప్పించాలని డిమాండ్ చేశారు. పోలవరం నిర్వాసితులకు మొండి చేయి చూపిస్తున్న కేంద్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా మే 4న చింతూరులో జరిగే బహిరంగ సభను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు డేగల మాధవరావు, పులుసు బాలకృష్ణ, ఆకిశెట్టి రాము, సోయం వీరమ్మ పాల్గొన్నారు.

ఎటపాక మండలం మురుమూరులో...

తాగునీటి సమస్యలను పరిష్కరించాలి

విఆర్.పురం : మండలంలోని ప్రచార భేరి కార్యక్రమం బుధవారం తెల్లవారి గూడెం, కారంగూడెం, గుల్లెట్ వాడ గ్రామాల్లో సిపిఎం కార్యదర్శి సోయం చిన్నబాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. ప్రతి ఇంటికి కరపత్రాలు ఇచ్చి వారి సమస్యలు తెలుసుకుంటూ ముందుకు సాగారు. ఉపాధి హామీ పని ప్రదేశానికి వెళ్లి కూలీలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా చిన్నబాబు మాట్లాడుతూ కారం గూడెం గ్రామంలో తాగునీరు సమస్య ఎక్కువగా ఉందని, బోరువేసి మోటార్ కలెక్షన్ ఇవ్వలేదని తెలిపారు. ఆ సమస్యను పరిష్కరించాలని కోరారు. ప్రజాస్వామ్య విలువలకు పాతరెస్తున్న బీజేపీ విధానాలను ప్రజలందరూ వ్యతిరేకించాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం బీజేపీకి పూర్తిగా లొంగిపోయిందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు వడ్లది రమేష్, కుంజ నాగిరెడ్డి, కార్యకర్తలు తెల్లం కన్నారావు, సత్తిరాజు, సున్నం కోటప్ప ముత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిపిఎం అల్లూరి జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు చిన్నయ్యపడాల్

మోడీతో ఆదివాసీలకు ముప్పు

పాడేరు : ప్రధాని మోడీ అవలంభిస్తోన్న విధానాలతో గిరిజనులకు ముప్పు వాటిల్లుతుందని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు బోనంగి చిన్నయ్య పడాల్ విమర్శించారు. మండలంలోని గుర్రగరువు గ్రామంలో బుధవారం సిపిఎం, సిపిఐ ప్రచార బేరి యాత్రను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న గిరిజన వ్యతిరేక విధానాలను చాటి చెప్పి ప్రజల్లో చైతన్యం నింపేందుకు సిపిఎం, సిపిఐ సంయుక్తంగా ప్రచార బేరి యాత్రను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని సామాన్యుల జీవన స్థితిగతులు పూర్తిగా దిగజారాయన్నారు. రైతులు పండించే పంటలకు సరైన గిట్టుబాటు ధర లభించ లేదని తెలిపారు. గిరిజన ప్రాంతంలో ప్రత్యేక హక్కులు, చట్టాలను పరిరక్షించుకోవడానికి పోరాటం సాగించాలని పిలుపునిచ్చారు. సిపిఎం మండల నాయకులు పాలికి లక్కు. ఎల్.సుందర్‌రావు పాల్గొన్నారు.

25న బహిరంగ సభను జయప్రదం చేయండి

డుంబ్రిగూడ : ఈనెల 25న పాడేరులో నిర్వహించే భారీ బహిరంగ సభను జయప్రదం చేయాలని కోరుతూ బుధవారం కించమండ వారపు సంతలో సిపిఎం, సిపిఐ ప్రచార బేరి జీపుజాతా నిర్వహించారు. ఈ సందర్భంగా సంత నుంచి కించమండ పంచాయతీ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి కరపత్రాలను పంచుతూ విస్తతంగా ప్రచారం చేపట్టారు. అనంతరం సిపిఎం మండల ప్రధాన కార్యదర్శి ఎస్‌బి పోతురాజు మాట్లాడుతూ, జీవో 3ను రద్దు చేయడంతో పాటు 1/70 భూబదాలాయింపు చట్టానికి చట్టానికి వ్యతిరేకంగా హైడ్రోపవర్ ప్రాజెక్టును నిర్మించడానికి బిజెపి ప్రభుత్వం పునుకుంటుందని చెప్పారు. గిరిజనులకు, రాష్ట్రానికి ద్రోహం చేస్తున్న బిజెపిని గద్దె దింపడానికి గిరిజనులు సన్నద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. 29 జరిగే బహిరంగ సభకు అధిక సంఖ్యలో గిరిజనులు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు టి.సూర్యనారాయణ, సిపిఎం మండల నాయకులు పి.సత్యనారాయణ, పి డుంబు, గిరిజన సంఘం నాయకులు తిలక్, జగన్నాథం పాల్గొన్నారు.

కూనవరం మండలంలో...

విఆర్.పురం మండలంలో...

కించుమండ వారపు సంతలో జీపు జాతాలో పాల్గొన్న సిపిఎం నాయకులు

ఎన్నికైన నూతన కార్యవర్గ సభ్యులు

పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ వార్షికోత్సవం

నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి-పాడేరుటౌన్: అల్లూరి జిల్లా కేంద్రం పాడేరులోని గొందూరు లవ్ అండ్ కేర్ చర్చ్‌లో బుధవారం అల్లూరి జిల్లా పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. విశాఖలోని ఒబిసిసి మినిస్ట్రీస్ నుంచి హనీ జాన్సన్ వాక్య సందేశాన్ని అందించారు. అనంతరం జిల్లా నూతన కార్యవర్గాన్ని అసోసియేషన్ వ్యవస్థాపకులు టి.స్టీఫెన్ (లక్ష్మణరావు) ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అసోసియేషన్ సలహాదారుగా పి.డేవిడ్ రాజు(పాడేరు), గౌరవ అధ్యక్షులుగా విలియమ్స్ బాలకష్ణ (హుకుంపేట), వై.హాన్స్ బాబు (రంపచోడవరం) అధ్యక్షులుగా వి.తిమోతి (జికె వీధి), ఉపాధ్యక్షులుగా ఎం.బాబురావు (పాడేరు), ఐజక్ సామ్యూల్ (అడ్డతీగల), ప్రధాన కార్యదర్శిగా కె.జేమ్స్ (హుకుంపేట), కార్యదర్శిగా చంద్రపాల్ (రంపచోడవరం) కోశాధికారిగా డి.రవికుమార్ (పాడేరు) ఎన్నికయ్యారు. అసోసియేషన్ వ్యవస్థాపకులు మాట్లాడుతూ పాస్టర్స్ అందరూ ఐక్యత కలిగి ఉండాలన్న ఉద్దేశంతోనే ఈ అసోసియేషన్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో బిషప్ దైవకృప చిక్కాల, పాస్టర్స్ జాన్ ఫ్రెడ్రిక్, డేవిడ్, బాబురావు, మత్స్యరాజు, జాషువా, ఇశ్రాయేలు, పాపిటిరావు పాల్గొన్నారు.

ఇంటింటా వైసిపి ప్రచారం

ప్రజాశక్తి -పెదబయలు రూరల్ : మండలంలోని పర్రెడ పంచాయతీ అంబపడ గ్రామంలో వైసిపి నేతుల గడప గడపకు సందర్శించి నువ్వే కావాలి జగనన్న కార్యక్రమం చేపట్టారు. సీఎం జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వ హయాంలో జరుగుతున్న అభివృద్ధి పనులను వివరించారు. ఈ కార్యక్రమంలో పర్రెడ వార్డ్ నెంబర్ కిల్లో స్వర్ణ లత, కార్యకర్తలు పాల్గొన్నారు.

హుకుంపేట: రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వ పాలనలో అనేక పథకాలు ప్రవేశ పెట్టారని ఉమ్మడి విశాఖ జిల్లా వ్యవసాయ శాఖ సలహా మండలి సభ్యులు ముత్యంగి విశ్వేశ్వరరావు తెలిపారు. మండలంలో తడిగిరి పంచాయితీలో మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో వాలంటీర్లు భవాని శంకర్, బసవరాజు, పంచాయితీ కన్వీనర్ సుంక్రి లక్ష్మీ, గృహ సారథులు పాల్గొన్నారు

గృహ సారథులతో సమావేశం

ప్రజాశక్తి-డుంబ్రిగూడ: మండలంలో వైసిపి పార్టీ మరింత బలోపేతానికి పంచాయతీ కన్వీనర్లు, గృహ సారథులు కషి చేయాలని ఆ పార్టీ మండల కన్వీనర్ ఏ గణపతి పిలుపునిచ్చారు. స్థానిక వెలుగు శాఖ కార్యాలయంలో పంచాయతీ కన్వీనర్లు, గృహ సారథులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలను గ్రామాల్లో ప్రతి ఇంటింటికి తీసుకెళ్లి చైతన్య పరచడంతో పాటు పార్టీ చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై గిరిజనులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వైస్ ఎంపీపీ ఎస్.ఆనంద్, సర్పంచ్ జి.నాగేశ్వరరావు, మాజీ జెడ్పిటిసి ఎం శ్రీరాములు, వైసిపి నాయకులు బి సింహాచలం పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి తీర్మానం

ప్రజాశక్తి-డుంబ్రిగూడ: స్థానిక పోతంగి పంచాయతీ గ్రామాల్లో వేసవిలో తాగునీటి కొరత ఉండకుండా ఉండేందుకుగాను తాగునీటి సౌకర్యం కల్పించడానికి, గ్రామాల్లో పారిశుధ్యం పనులు, వీధి బల్బులు కల్పించడానికి బుధవారం పంచాయతీ కార్యాలయంలో తీర్మానం చేపట్టారు. సర్పంచ్ వెంకటరావు అధ్యక్షతన ఉప సర్పంచ్, వార్డు సభ్యులు పంచాయతీ సమావేశంలో తీర్మానం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఎస్.జగ్గునాయుడు, ఈఓపిఆర్‌డి విజయ్, పంచాయతీ కార్యదర్శి ఎస్.బాలకృష్ణ పాల్గొన్నారు.

అల్లూరి జిల్లాలో అక్రిడిటేషన్ల జారీకి చర్యలు

ప్రజాశక్తి-పాడేరు: అల్లూరి సీతారామరాజు జిల్లాలో విలేకరులకు ఈ ఏడాది అక్రిడేషన్ల జారీ ప్రక్రియకు చర్యలు చేపట్టినట్లు జిల్లా సమాచారం పౌర సంబంధాల శాఖ అధికారి పి.గోవిందరాజులు వెల్లడించారు. బుధవారం ఆయన ప్రజాశక్తితో మాట్లాడుతూ,జిల్లాలోని మూడు డివిజన్లలో ఉన్న 22 మండలాల విలేకరులకు జిల్లా అక్రిడేషన్లు జారీ జారీ చేస్తామని, బస్సు పాసులు అల్లూరి జిల్లా పరిధిలోనే ఉంటాయన్నారు. జిల్లా కేంద్రంలో పనిచేసే ఒక్కొక్క పత్రిక నుంచి ఇద్దరు రిపోర్టర్లకు, ఒక ఫోటోగ్రాఫర్ (పనిచేస్తూ ఉంటే) చొప్పున స్టేట్ అక్రిడేషన్లు జారీ చేయనున్నట్లు తెలిపారు

ప్రతి విలేఖరికి సంబంధించిన ప్రచురితమైన వార్తల మూడు నెలల క్లిప్పింగ్స్ జత చేయాలన్నారు. నెలకు కనీసం 10 క్లిప్పింగ్స్ ఉండాలని, పత్రిక ముద్రణ రెగ్యులారిటీ ఉండాలన్నారు.రోజుకు కనీసం రెండువేల పత్రికల ముద్రణ ఉండాలని చెప్పారు.అక్రిడేషన్ల కమిటీలు పూర్తయినందున మే నెలాఖరు నాటికి కొత్త అక్రిడేషన్లు జారీ పూర్తి చేసేందుకు అవకాశం ఉందని. ఈ నెలలోనే దరఖాస్తుల స్వీకరణ చేపడతామని. ప్రస్తుతం ఆన్లైన్‌లో కూడా దరఖాస్తు చేసుకోవడానికి వెబ్సైట్ ఓపెనై ఉన్నందున దరఖాస్తు చేసుకోవచ్చునని తెలిపారు. రెండు ఏళ్లకు అక్రిడేషన్లు జారీ చేయనున్నట్లు తెలిపారు. అర్హతలు, ఆధారాలు ఉన్న వెటరన్ జర్నలిస్టులకు అక్రిడేషన్లు మంజూరు చేస్తామని, 20 సంవత్సరాల పాటు విలేకరిగా పని చేసిన అనుభవం ఉండాలన్నారు. ఆయా పత్రికల్లో పని చేసినప్పుడు పొందిన అక్రిడేషన్ల ప్రూఫ్స్ సబ్మిట్ చేసి అలాగే గతంలో పని చేసిన పత్రికల్లో వచ్చిన బై లైన్ ఆర్టికల్స్ జిరాక్స్‌లను జత చేసి దరఖాస్తులను ఇస్తే పరిశీలించి అక్రిడేషన్ల జారీకి చర్యలు తీసుకుంటామన్నారు.పత్రికల్లో కొత్తగా చేరిన విలేకరులకు ఐదేళ్ల అనుభవం తప్పనిసరిగా ఉంటేనే అక్రిడేషన్ పొందడానికి అర్హులవుతారని, దీనికి సంబంధించిన ఆధారాలతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వెబ్, పిడిఎఫ్ మీడియాలకు సంబంధించి అక్రిడేషన్ల మంజూరుకు అవకాశం లేదని స్పష్టం చేశారు.

పాడేరులో ఉదయం అలుముకున్న మంచు

మధ్యాహ్నం ఎండకు నిర్మానుష్యంగా మారిన అంబేద్కర్ సెంటర్

పాడేరులో విభిన్న వాతావరణం

ఉదయం మంచు.. మధ్యాహ్నం ఎండ తీవ్రత

ప్రజాశక్తి-పాడేరుటౌన్: ఓవైపు సూర్యుడు రోజు రోజుకూ తన ఉగ్రరూపాన్ని ప్రదర్శిస్తున్నాడు. జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో 42 డిగ్రీలకు పైగా పగటి ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఈ దాటికి జనం విల విల్లాడుతున్నారు. ఈ సమయంలో బుధవారం ఉదయం విపరీతంగా మంచు కురిసింది. 8 గంటల వరకు శీతాకాలాన్ని తలపించేలా మంచు తెరలు రహదారులపై, పాడేరు మన్యంలోని ఆయ ప్రాంతాల్లో దట్టంగా కమ్ముకున్నాయి. దీంతో, ఎదురుగా వచ్చే వాహనాలు కూడా కనిపించక చోధకులు ఇబ్బంది పడ్డారు. కొందరు లైట్లు వేసుకుని రాకపోకలు సాగించారు. అనంతరం మధ్యాహ్న సమయంలో సూర్యుడు తన ప్రవతాపం చూపించాడు. ప్రజలు ఇళ్ల నుంచి బయటికి వచ్చేందుకు భయపడ్డారు. దీంతో రాకపోకలు లేక రహదారులు నిర్మాణుష్యంగా కనిపించాయి.

ఇంటింటికి స్ప్రేయింగ్

ప్రజాశక్తి-డుంబ్రిగూడ

రానున్న ఎపిడమిక్ సీజన్‌లో మలేరియా జ్వరాలు ప్రబలకుండా ఉండేందుకు గాను ముందస్తు చర్యల్లో భాగంగా మండలంలోని డుంబ్రిగూడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో బుధవారం అంత్రిగూడ గ్రామంలో మలాథియాన్ స్ప్రేయింగ్ పనులు ప్రారంభించారు. ఆ గ్రామంలోని ప్రతి ఇంటింటికి స్ప్రేయింగ్ చేపట్టారు. అనంతరం ఎంపీహెచ్ఈఓ బి.బాబురావు మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ తమ ఇంటి లోపల స్ప్రేయింగ్ చేయించుకోవాలని, దీంతో దోమలు వ్యాప్తి చెందవన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్లు సాంబశివరావు, రామారావు, హెల్త్‌అసిస్టెంట్ ఎస్ స్వామి, ఎస్.ప్రభాకర్ పాల్గొన్నారు.

స్ప్రేయింగ్ చేస్తున్న ఆరోగ్య సిబ్బంది

చందనోత్సవాన్ని విజయవంతం చేయాలి

ప్రజాశక్తి-కలెక్టరేట్, ఎంవిపి.కాలనీ విశాఖ : సింహాచలంలో ఈ నెల 23న జరిగే చందనోత్సవాన్ని అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి విజయవంతంచేయాలని జిల్లా కలెక్టర్ ఎ.మల్లికార్జున కోరారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో బుధవారం చందనోత్సవ ఏర్పాట్లపై వివిధ శాఖల ఉన్నతాధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ చందనోత్సవం సందర్భంగా ఈ నెల 23న తెల్లవారుజామున 3 గంటల నుంచి 3.30 మధ్య ఆలయ ధర్మకర్త, వారి కుటుంబ సభ్యులతో పాటు దేవాదాయశాఖ మంత్రివర్యులు స్వామివారిని దర్శించుకుంటారని, అదే సమయంలో స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పిస్తారని తెలిపారు. 3.30 నుంచి 4.30 గంటల మధ్య వివిఐపి దర్శనాలు, దేవస్థాన ట్రస్టు సభ్యులు స్వామి వారిని దర్శించుకుంటారన్నారు. కేటాయించే టిక్కెట్లలో దర్శన టైమింగ్స్‌ను ముద్రించడం జరుగు తుందన్నారు. తెల్లవారుజామున 4 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు ఉచిత దర్శనంతో పాటు రూ.300, రూ.1000 దర్శనం టైమింగ్స్‌తో కూడిన టిక్కెట్లపై భక్తులు దర్శనం చేసుకోవచ్చని తెలిపారు. వివిఐపిలు స్లాట్ 1 ఉదయం 5 నుంచి 7 గంటల మధ్య , స్లాట్ 2 ఉదయం 8 నుంచి 10 గంటల మధ్య దర్శన ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు. మీడియాకు ఉదయం 5 నుంచి 7 గంటల మధ్య దర్శనం ఉంటుందన్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ప్రతి 20 మీటర్లకు ఒక వాటర్ పాయింట్ ఏర్పాటు చేయాలని, టాయిలెట్స్ ఏర్పాటు చేయాలని జివిఎంసి అధికారులను ఆదేశించారు. కొండపైన దిగువ పుష్కరిని, భైరవ కోన, బస్టాండ్ తదితర ప్రాంతాల్లో శానిటేషన్ నిర్వహించాలన్నారు. భక్తులు రద్దీగా ఉండే ప్రదేశాలలో అవసర మైన చోట మెడికల్ క్యాంపులను ఏర్పాటు చేయాలని, నడక మార్గంలో కూడా మెడికల్ క్యాంపు ఏర్పాటు చేయాలని వైద్యాధికారులను ఆదేశించారు. విద్యుత్తు అంతరాయం లేకుండా చర్యలు చేపట్టాలని ఆ శాఖ అధికారులను ఆదేశించారు. అగ్నిమాపక శాఖ, రోడ్లు భవనాలు శాఖ అధికారులు అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. అవాంచనీయ సంఘటనలు జరగకుండా పోలీసు బందోబస్తు నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో దేవాదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణ, పోలీసు కమిషనర్ త్రివిక్రమ వర్మ, జాయింట్ కలెక్టర్ కెఎస్.విశ్వనాథన్, జివిఎంసి కమిషనర్ సిఎం.సాయికాంత్ వర్మ, సింహాచల ఇఒ త్రినాథరావు, చీఫ్ ఫెస్టివల్ ఆఫీసర్ అజాద్, డిఆర్ఒ శ్రీనివాసమూర్తి, ఆర్‌డిఒ హుసేన్ సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక వాహనాలు స్వాధీనం

ప్రజాశక్తి -పెదబయలు రూరల్ : మండలంలో మంగబంధ, చుట్టుమెట్టలో అక్రమంగా తరలిస్తున్న ఇసుక రవాణాపై అధికారులు ఉక్కు పాదం మోపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చట్టవిరుద్ధంగా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ఏడు వాహనాలను అదుపులో తీసుకున్నారు. పెదబయలు మండల కేంద్రంగా నిర్వహిస్తున్న అక్రమ ఇసుక రవాణాకు సంబంధించి బుధవారం పాడేరు మండలానికి చెందిన ఏడు వాహనాలను రెవెన్యూ సిబ్బంది పట్టుకుని స్థానిక పోలీస్ స్టేషన్‌కు తరలించారు. దీనిపై స్థానిక తహసిల్దార్ భాస్కరరావు మాట్లాడుతూ, అనుమతి లేకుండా అక్రమంగా తరలిస్తున్న ఇసుక వాహనాలు పట్టుకున్నామన్నారు.

క్రమశిక్షణతో విద్యను అందించాలి

ప్రజాశక్తి-హుకుంపేట: విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్య నేర్పించాలని జెడ్పిటిసి రేగం మత్స్యలింగం సూచించారు. మండలంలోని గత్తుం పంచాయతీ మండిపుట్టులో ఎంపీపీ పాఠశాలను సందర్శించారు. అనంతరం మత్స్యలింగం మాట్లాడుతూ, విద్యార్థులకు రుచికరమైన భోజనాలతో పాటు నాణ్యమైన విద్యను నేర్పించాలఅన్నారు. పాఠశాల పరిసర ప్రాంతాల్లో శుభ్రపరచి విద్యార్థులకు ఎటువంటి ప్రమాదం లేకుండా చూసుకోవాలన్నారు. అనంతరం ఆశ్రమ గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలలో సందర్శించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎంపీటీసీ సంబాయి. కొండమ్మ, స్థానిక సర్పంచ్ పాడి పోతురాజు, కొంతిలి సర్పంచ్ రేగం రమేష్, మత్స్య పురం సర్పంచ్ పూజారి మేరీ పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నిషేధిద్దాం

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ : ప్లాస్టిక్ వినియోగాన్ని నిషేధించి పర్యావరణాన్ని కాపాడుకుందామని ప్లాట్‌ఫామ్ 65 రెస్టారెంట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ధనలక్ష్మి పిలుపునిచ్చారు. ఎర్త్ డే పురస్కరించుకొని ప్లాట్ ఫామ్ 65 ఆధ్వర్యాన బుధవారం బీచ్ క్లీనింగ్‌డ్రైవ్ చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్లాస్టిక్ వినియోగం అధికం అవటం వల్ల వాతావరణంలో కలిగిన మార్పులతో భూమిలో అధిక శాతం వేడి ఉత్పత్తి అవుతుందన్నారు. తద్వారా వ్యవసాయం సరిగ్గా దిగుబడి రాకపోవడం, నీరు కాలుష్యం కావడం సముద్రంలో జీవరాశులు మృతి చెందడం జరుగుతున్నాయని వివరించారు. ప్రతి ఒక్కరూ బాధ్యతతో ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా తగ్గించి భూమాతను కాపాడుకోవాలన్నారు.

వైసిపి ప్రభుత్వ పాలనలో

గిరిజనుల బతుకులు దయనీయం

పునాది గొయ్యిని పరిశీలిస్తున్న మండల టిడిపి నాయకులు

ప్రజాశక్తి-మారేడుమిల్లి

వైసీపీ ప్రభుత్వంలో అల్లూరి జిల్లాలోని గిరిజనుల బతుకులు దయనీయంగా మారాయని టిడిపి మండల అధ్యక్షులు గురుకు శేషు కుమార్ అన్నారు. బుధవారం మారుమూల గిరిజన ప్రాంతంలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం మంజూరు చేసిన ఇళ్లను కట్టుకునేందుకు కొంతమంది గిరిజనులు ఉన్న పూరిళ్లను కూలగొట్టారని, కాని కొత్త ఇళ్ళ నిర్మాణం మధ్యలో ఆగిపోయి రోడ్డున పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు.

చావడికోట పంచాయితీ పరిధిలోని బొడ్లంక, తేనల మామిడి. బంద, చెక్కవాడ, చావడికోట గ్రామాల్లో 137 ఇళ్లు మంజూరు కాగా పునాదుల బేస్‌మెంట్ లెవెల్‌లో ఆగిపోయాయని, దీంతో గిరిజనులు నాలుగు నెలలుగా ఇళ్లు లేక గుడారాలు చాటున తలదాచుకుంటున్నారని తెలిపారు. గిరిజనులంటే వైసీపీ ప్రభుత్వానికి అంత చిన్నచూపు ఏంటని ప్రశ్నించారు. గిరిజనులకు మంచినీరు, రోడ్డు సదుపాయం కల్పించడంలో ఎమ్మెల్యే విఫలమయ్యారని శేషు కుమార్ మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పల్లాల రాజ్ కుమార్ రెడ్డి, మారేడుమిల్లి మండల ప్రధాన కార్యదర్శి పొడియం శ్రీను బాబు, కార్యదర్శి రేవుల జానకి రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి విశాఖలో కాపురం పెడితే

ఉత్తరాంధ్ర అభివృద్ధి చెందినట్టేనా..?

- లోక్‌సత్తా రాష్ట్ర అధ్యక్షుడు బాబ్జి

ప్రజాశక్తి- సీతమ్మధార : వికేంద్రీకరణలో భాగంగా వచ్చే సెప్టెంబర్ నుంచి విశాఖపట్నంలో తాను కాపురం పెడతానని ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి శ్రీకాకుళం లో ప్రకటించడం హాస్యాస్పదంగా ఉందనిలోక్ సత్తాపార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి ఎద్దేవా చేశారు. ముఖ్యమంత్రి విశాఖపట్నంలో కాపురం పెడితే ఉత్తరాంధ్ర అభివృద్ధి చెందినట్టేనా అని ప్రశ్నించారు. బుధవారం విశాఖపట్నం శ్రీ నగర్ పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ, గడచిన నాలుగేళ్లలో ఉత్తరాంధ్రలో అనేక పరిశ్రమలు మూత పడ్డాయని, కొత్త పరిశ్రమలు రాలేదని, రైతులు వ్యవసాయరంగం ఆర్థిక సంక్షోభంలో చిక్కుకున్నాయని,యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేక వలస పోతున్నారని, ఇలా కోకొల్లలుగా సమస్యలుంటే, ముఖ్యమంత్రి కాపురం, మకాం గురించే పదేపదే మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు.

ఉమ్మడి విశాఖ జిల్లాలో దేశానికే తలమానికంగా ఉన్న నాలుగు సహకార చక్కెర ఫ్యాక్టరీలను మూసేశారని, వాటిని ఆధునికీకరించి తెరిపిస్తామన్న హామీని పక్కనబెట్టి ఇపుడు ప్రయివేటుపరం చేయాలని చూడడం దుర్మార్గమన్నారు.రాష్ట్రంలోని మూడు ప్రాంతాల ప్రజలకు పరిపాలన వికేంద్రీకరణ కావాలని కోరుకుంటున్నారనే విషయం ముఖ్యమంత్రి గ్రహించాలన్నారు సమావేశంలో లోక్‌సత్తా ఉద్యమ సంస్థ రాష్ట్ర నేత నాయుడు వేణుగోపాల్ పాల్గొన్నారు.

గెడ్డ నీరే గతి...

- కనీసం బోరు బావి కూడా లేని చంద్రుపల్లి, లైకెన్‌పూర్ గ్రామాలు
- అధికారులు, ప్రజా ప్రతినిధులకు విన్నవించినా ఫలితం శూన్యం
- రహదారి లేక తీవ్ర ఇబ్బందులు.. నేటికీ డోలి మోతలే శరణ్యం

ప్రజాశక్తి -సీలేరు : రహదారులు, మంచినీటి సౌకర్యాలు కల్పించడానికి కోట్లాది రూపాయాలు ఖర్చు చేస్తున్నట్లు అధికారులు, ప్రజాప్రతినిధులు ఎన్ని కబుర్లు చెప్పినా, ఆ సౌకర్యాలేవీ తమ దరికి చేరడం లేదని గిరిజనులు వాపోతున్నారు. గుక్కుడు నీటి కోసం గిరిజనులు ఆపసోపాలో పడుతున్నారు. రహదారి సౌకర్యం లేక అత్యవసర సమయాల్లో వారికి డోలిమోతలే శరణ్యమవుతున్నాయి. ఇటువంటి పరిస్థితి ఎక్కడో కాదు.., సీలేరు మేజర్ పంచాయతీ పరిధిలోనే ఉంది.

జీకే వీధి మండలం సీలేరు మేజర్ పంచాయతీ పరిధిలోని చంద్రుపల్లి, లైకెన్‌పూర్ గ్రామాలు చింతపల్లి క్యాంపు గ్రామానికి కేవలం నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉన్నాయి. అయినా ఈ రెండు గ్రామాలకు నేటికీ తాగునీటి వనరుల్లేవు. కనీసం బోరుబావి కూడా లేదంటే ఆశ్చర్యం కలగక మానదు. ఈ రెండు గ్రామాల ప్రజలు సీలేరు నది పరివాహక ప్రాంతంలో పిల్ల కాలువలు ద్వారా వచ్చిన నీటినే తాగుతున్నారు. తమ గ్రామాలకు రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న గెడ్డల్లో పెద్ద పెద్ద గుంతల ఏర్పాటు చేసుకొని అందులో నీటిని సేకరించి ఆ నీటినే తాగడానికి, వాడుకోవడానికి వినియోగిస్తున్నారు.

వేసవి కాలంలో మండుటెండలో సైతం రెండు కిలోమీటర్ల దూరం నడిచి వెళ్లి నీటిని తెచ్చుకోవాల్సిన దుస్థితి నెలకొంది. అదే వర్షా కాలంలో అయితే గెడ్డల్లోని నీరు బుదరమయం కాగా, ఆ నీటినే తాగాల్సి వస్తోంది. ఈ కలుషిత నీరు తాగడం వల్ల గిరిజనులు రోగాల బారిన పడుతున్నారు. తాగడానికి అత్యవసరమైన మంచినీటటి సౌకర్యం లేకుంటే తాము ఎలా బతికేదని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

విన్నవించినా ఫలితం శూన్యం

తమ గ్రామాలకు తాగునీటి సౌకర్యాలు కల్పించాలని అనేక సార్లు అధికారులు, ప్రజాప్రతినిధులకు విన్నవించినా ఫలితం లేకపోయిందని ఈ రెండు గ్రామాల ప్రజలు వాపోతున్నారు. తమకు మంచినీటి సౌకర్యం కూడా కల్పించకుండా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని గిరిజనులు ఆరోపించారు. ఇప్పటికైనా జిల్లా, ఐటిడిఎ అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి తమ గ్రామాలకు మినీ వాటర్ ట్యాంక్ గాని, బోరుబావులు గాని ఏర్పాటు చేసి మంచినీటి సమస్యను పరిష్కరించాలని గిరిజనులు కోరుతున్నారు.

రోడ్డు లేక డోలిమోతలు

సీలేరు మేజర్ పంచాయతీ పరిధిలో ఉన్న చంద్రుపల్లి, లైకెన్‌పూర్ గ్రామాలకు మట్టి రోడ్డు కూడా లేదు. ఈ గ్రామాల నుంచి చింతపల్లి క్యాంపు గ్రామం వరకు నాలుగు కిలోమీటర్ల మేరకు ఎటువంటి రహదారి లేకపోవడంతో కాలిబాటలో నడుచుకుంటూ నిత్యావసర సరుకులు తెచ్చుకుంటున్నారు. అనారోగ్యం సమయాల్లో డోలి కట్టి రోగులను అడవి మధ్యలో నుండి మోసుకుంటూ ఆసుపత్రికి తరలించాల్సి వస్తోంది. తమ గ్రామాలకు రహదారి సౌకర్యం కల్పించాలని గ్రామసభల ద్వారా అధికారులకు విన్నవించి, సమస్యలను లిఖితపూర్వకంగా అందజేసిన ఇప్పటి వరకు ఎటువంటి సౌకర్యాలు కల్పించడానికి చర్యలు చేపట్టలేదని వాపోయారు. ఇప్పటికైనా తమ గ్రామాలకు రహదారి సౌకర్యం ఏర్పాటు చేయాలని రెండు గ్రామాల గిరిజనులు కోరుతున్నారు.

గెడ్డలోని కలుషిత నీటిని సేకరిస్తున్న గిరిజన మహిళలు

తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో 'నెమలిపురి'కి చోటు

ప్రజాశక్తి -తగరపువలస : స్థానిక సంగివలస అనిల్ నీరుకొండ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్సెస్‌లో అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ నెమలిపురి సత్యనారాయణకు తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు దక్కింది. 'ప్రిజన్ రైటింగ్ డ్యూరింగ్ ఏమెర్జెన్సీ ఇన్ ఇండియా - ఎ స్టడీ' పేరిట సమర్పించిన థీసెస్‌కు ఆంధ్ర విశ్వ విద్యాలయం నుంచి డాక్టరేట్ అందుకున్న తొలి భారతీయునిగా నిలిచిన నెమలిపురి సత్యనారాయణ ప్రతిభను గుర్తించిన తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ గుర్తించి అభినందించింది. ఈ మేరకు ఎయు విసి ఆచార్య ప్రసాదరెడ్డి నుంచి అవార్డు అందుకున్నట్లు తెలిపారు. తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ ప్రతినిధి, జిల్లా ఇన్‌ఛార్జి వి.భాస్కరాచారి, ఎయు రిజిస్ట్రార్ కృష్ణమోహన్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. కాగా దేశ, ప్రపంచ దేశాల జైలు సాహిత్యం అధ్యయనం చేసి, వాటి ప్రాముఖ్యతను తెలుసుకున్నారని నెమలిపురి తెలిపారు. ఇప్పటికే పశ్చిమ యూరోప్ దేశాల విశ్వ విద్యాలయాల్లో జైలు సాహిత్యానికి ఓ ప్రత్యేక స్థానం ఉందన్నారు. కాగా తెలుగు బుక్ ఆఫ్ రికార్డుల్లో స్థానం దక్కించుకున్న నెమలిపురి సత్యనారాయణను పలువురు అభినందిస్తున్నారు.

వేసవి సెలవుల్లో

తరగతులు నిర్వహిస్తే చర్యలు

నిబంధనలు అతిక్రమించిన చైతన్య కాలేజీపై ఆగ్రహం

చైతన్య కాలేజీని తనిఖీ చేస్తున్న కమిషన్ చైర్మన్, సభ్యుడు

ప్రజాశక్తి- సీతమ్మధార : ప్రత్యేక తరగతులు, శిక్షణ పేరిట వేసవి సెలవుల్లోనూ విద్యాలయా లను తెరిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ఛైర్మన్ కేసలి అప్పారావు, సభ్యులు గొండు సీతారాం హెచ్చరించారు. కమిషన్‌కు కోకొల్లలుగా అందుతున్న ఫిర్యాదుల మేరకు బుధవారం రామాటాకీస్ ప్రాంతంలో శ్రీచైతన్య కాలేజీని ఆకస్మికంగా సందర్శించారు. ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలకు విరుద్ధంగా వేసవి సెలవుల్లో అక్కడ విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నట్లు గుర్తించి, యాజమాన్యంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్కడి విద్యార్థులు, యాజమాన్య ప్రతినిధులతో మాట్లాడారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నట్టు విద్యార్థులు కమిషన్ దృష్టికి తెచ్చిన నేపథ్యంలో మండిపడిన ఛైర్మన్ అప్పారావు, సభ్యులు సీతారాం స్పందిస్తూ వెంటనే విద్యార్థులందరినీ బయటకు పంపేయాలని ఆదేశించారు. రాష్ట్రంలోని అన్ని విద్యాలయాలు వేసవి సెలవులను విధిగా పాటించా ల్సిందేనని, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే కళాశాల గుర్తింపు రద్దు చేయక తప్పదని హెచ్చరించారు. అన్ని జిల్లాల్లో విద్యాశాఖ ఉన్నతాధికారులు పాఠశాలలు కాలేజీలపై ప్రత్యేక నిఘా పెట్టాలని, మండుటెండల్లో వేసవి సెలవులు ఇచ్చినప్పటికీ తరగతులను నిర్వహిస్తు న్నట్లు గుర్తిస్తే తగు చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేస్తున్నట్లు వెల్లడించారు. పర్యటనలో బాలల సంరక్షణ విభాగం జిల్లా ప్రతినిధి ఎ.ఆనంద్, మహిళా సంరక్షణ కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

సామాన్య భక్తులకు ఇబ్బందులు లేకుండా చర్యలు

రాష్ట్ర దేవాదాయశాఖ కమిషనర్ సత్యనారాయణ

ప్రజాశక్తి- సింహాచలం: సింహాద్రి అప్పన్న దర్శనానికి వచ్చే సామాన్య భక్తులకు ఎటువంటి ఇబ్బందులు రాకుండా అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ సూచించారు. బుధవారం సింహాచలం వచ్చిన ఆయనకు ఆలయ ఇఒ వి.త్రినాధరావు సహాయ కమిషనర్ సుజాత ఆలయ సాంప్రదాయ ప్రకారం స్వాగతం పలికారు. ఈసందర్భంగా సింహాద్రి అప్పన్నను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన తర్వాత ఈనెల 23న నిర్వహించనున్న చందనోత్సవ ఏర్పాట్లుపై ఇఒ, ఇతర దేవాలయ సిబ్బందితో కలిసి పరిశీలించారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ చందనోత్సవం రోజున అధిక సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున వారికి క్యూలైన్లు, అవసరమైన నీడ, తాగునీటి సదుపాయం, వైద్యశిబిరాలు, భద్రతా పరమైన అన్ని ఏర్పాట్లు చేయవాలని సూచించారు. భక్తులకు మజ్జిగ, తాగునీరు, చిన్నారులకు పాలు బిస్కెట్లు,ఇ తరత్రా సేవా కార్యక్రమాల నిర్వహణకు ముందుకు వచ్చే స్వచ్ఛందసంస్థల ప్రతినిధులకు స్వామి దర్శనాలకు భక్తులు వెళ్లే క్యూలైన్లలో కాకుండావేరేగా ప్రత్యేక మార్గం ఏర్పాటు చేయాలని సూచించారు.